క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

జూపాడుబంగ్లా: జగనన్నకాలనీల్లో ఇంటిస్థలం , ఇళ్లు పొందిన లబ్ధిదారులు సత్వరమే ఇళ్లనిర్మాణాలు పూర్తిచేసుకోవాలని ఎంపీడీఓ మంజులవాణి, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, సర్పంచ్ ఈశ్వరరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని తంగడంచ గ్రామంలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లనిర్మాణాలు ప్రారంభించుకోని లబ్ధిదారులు వెంటనే గృహాలు కట్టుకోవాలని సూచించారు. అనంతరం సచివాలయంలో లబ్ధిదారులతో అధికారులు సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులు ఎంత త్వరగా ఇళ్లు కట్టుకొంటే అంతేత్వరగా బిల్లులు మంజూరు చేస్తున్నట్లు ఏఈ శ్రీనాథ్ తెలిపారు.

సింగోటం జాతరకు ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి తెలంగాణ రాష్ట్రం కొల్లాపూరు మండలంలోని సింగోటం జాతర సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగోటంలో జాతర సందర్భంగా ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు కొత్తపల్లి నుంచి ఆత్మకూరు, కర్నూలు మీదుగా సింగోటానికి ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రతి వ్యక్తికి చార్జీ కొత్తపల్లి నుంచి సింగోటానికి రూ.275 చొప్పున నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు.

14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

జూపాడుబంగ్లా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తరిగోపుల గ్రామంలో ఈనెల 14న రాష్ట్ర స్థాయి న్యూకేటగిరీ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణారెడ్డి, జయశేఖరరెడ్డి, గోపాల్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నెంబర్లు: 98668 68123, 96762 67969 నంబర్లకు ఫోన్‌చేసి రూ.600ల ప్రవేశరుసుము చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు'

పాములపాడు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేబీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ దేశప్రజలను విస్మరిస్తుందని విమర్శించారు. ప్రజలు ఐకమత్యంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి స్వామన్న, వెంకటేశ్వరరావు, బాల ఏసు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పీర్లచావిడి నిర్మాణానికి జెడ్పీటీసీ ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో పీర్లచావిడి నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి రూ. 10,116 నగదును గురువారం అందజేశారు. రుద్రవరం గ్రామస్తులు జెడ్పీటీసీని కలిసి ఆర్థిక సాయం అందజేయాలని కోరాగా స్పందించిన జెడ్పీటీసీ వెంటనే అగీకరించారు. రుద్రవరం సర్పంచ్ రామస్వామికి జెడ్పీటీసీ సభ్యురాలి భర్త మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లింగన్న, గ్రామ పెద్దలు , తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డు మెంబర్ మృతి

మిడుతూరు: మండల పరిధిలోని పైపాలెం గ్రామంలో 5వ వార్డు మెంబర్ వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ రూ. 5000 ఆర్థిక సాయాన్ని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనాయతుల్లా చేతుల మీదుగా అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

పగిడ్యాల: జగనన్న ఆదర్శ కాలనీలలో లబ్ధిదారులు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి కోరారు. గురువారం మండలంలోని పడమర ప్రాతకోట లే అవుట్ కాలనీని సందర్శించి, లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. హౌసింగ్ బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని మార్చి 24లోగా నిర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు సమతయశోధర, ఇషాం బాష తదితరులు ఉన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మల్యాలలో రెండో రోజు కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: పేదలకు సంక్షేమ పథకాలిస్తూ వారిని అభివృద్ధిబాటలో నడిపించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో రెండోరోజు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. గ్రామంలోని ప్రతి గడప గడపకు వెళ్లి మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారాచూసి చలించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఉన్న ఊళ్లోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకుగాను సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. పథకాల మంజూరులో మధ్యదళారుల ప్రమేయం లేకుండా, ఎవరి ప్రమేయం లేకుండా, పైసాఖర్చులేకుండా ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకున్నవారికి పైస లిచ్చిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని గుర్తుచేశారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

గ్రామంలో తాగునీటి కుళాయిల ఏర్పాటు, ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగల తొలగింపు, ఇంటిస్థలాలు, ఇళ్లు మంజూరు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం వంటి సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరయ్య, అంజిబాబు, కృష్ణ, చిన్న మౌలాలిస్వామి, సహకార సొసైటీ చైర్మన్లు సగినేల హుసేనయ్య, శాతనకోట వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పరికరాలు



తంగడంచ ఆర్బీకే వద్ద రైతులకు రాయితీపై ఇస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లు

జూపాడుబంగ్లా: రైతుభరోసా కేంద్రాల్లో రాయితీపై స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తక్కువ నీటిలభ్యత ఉన్న రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లను ఏర్పాటు చేసుకొని తక్కువ నీటివనరులతో అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న పరికరాలను అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతులు ఆర్బీకేల్లో రాయితీ పరికరాలను పొందవచ్చని ఆయన తెలిపారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ



శివం రోడ్డుకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఈఓ, ధర్మకర్తల మండలి సభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ప్రధానాలయానికి తూర్పు భాగంలో నిర్మించతలపెట్టిన శివంరోడ్డు నిర్మాణానికి శుక్రవారం దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు హనుమంత్‌నాయక్, ధర్మరాజు భూమిపూజ నిర్వహించారు. సుమారు రూ.80లక్షల వ్యయంతో రహదారి నిర్మించనున్నారు. ముందుగా సంప్రదాయాన్ని అనుసరించి అర్చకులు పూజలు నిర్వహించారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత ఇరువైపులా భక్తులు శ్రీస్వామిఅమ్మవార్ల ప్రభోత్సవం, రథోత్సవం, గ్యాలరీ నిర్మించనున్నారు. రహదారికి ఒకవైపు గ్యాలరీ వెనుకభాగంలో క్యూలైన్లు కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ క్యూలైన్ క్యూకాంప్లెక్స్‌కు అనుసంధానం చేపడుతుంది. భక్తుల రద్దీ అధికంగా ఉండే కార్తికమాసం, శ్రావణమాసం, మహాశివరాత్రి, ఉగాది ఉత్తవాల సమయాలలో ఈ క్యూలైన్‌ను వినియోగిస్తారు. రహదారి విద్యుద్దీకరణ పనులకు సంబంధించి అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ వైరింగ్ కూడా చేస్తున్నారు. కార్యక్రమంలో ఈఈ వి రామకృష్ణ, ఆలయ ఏఈవో హరిదాసు, పీఆర్వో టీ.శ్రీనివాసరావు, డీఈఈ నరశింహారెడ్డి, చంద్రశేఖరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అభివృద్ధి ప్రణాళికతో రండి

- ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు చేపట్టదలచిన అభివృద్ధి ప్రణాళికతో వస్తే తాను సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గురువారం శ్రీశైలంలోని అతిథి గృహంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులతో ఎమ్మెల్యే శిల్పా చర్చలు జరిపారు. రాష్ట్ర దేవదాయశాఖ 2017లో ప్రఖ్యాత ధార్మిక సంస్థ ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు శ్రీశైలంలో 22 ఎకరాల స్థలం కేటాయించింది. అయితే సరైన నిర్మాణ ప్రణాళిక, అందుకు తగిన అనుమతులు రాకపోవడంతో ఇంతవరకు ఆ స్థలంలో వారు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదు. జగద్గురు పీఠం కోసం ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం 10 ఎకరాలు కేటాయించింది. జగద్గురు పీఠం తమ ప్రణాళికలో పేర్కొన్న విధంగా భక్తులకు ఉచిత వసతి, పాఠశాల, ఆసుపత్రి నిర్మించడానికి పూజాది కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారికి ఇచ్చిన స్థలంలో ఎలాంటి అభివృద్ధి చేయాలనుకున్నారు తెలపాలని ఆ సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే శిల్పా చర్చించారు. హిందూ సంస్కృతి గోప్పతనం చాటేలా ఈ స్థలంలో ఒక అధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మించాలని సూచించారు. అలాగే ఆయుర్వేద వైద్యశాల, దానికి అనుబంధంగా ఒక ఆయుర్వేద రీసెర్చ్ సెంటర్ నిర్మిస్తే దేశానికి ఎంతో ఉపయోగమని చెప్పారు.

బ్యాక్ వాటర్‌లో ఇంజిన్ బోట్ల నిషేధం



మూర్వకొండ ఘాట్‌లో నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

పగిడ్యాల: కృష్ణానది పరివాహక గ్రామాల వెంట విస్తరించిన శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోట్లపై నిషేధం విధించినట్లు తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎస్ఐ నాగార్జున తెలిపారు. గురువారం మండల పరిధిలోని మూర్వకొండ ఘాట్‌ను సందర్శించారు. అనంతరం ఘాట్ నిర్వాహకులు, మత్స్యకారులతో వారు మాట్లాడుతూ అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేసి నదిలో బోట్లు తిప్పితే సీజ్ చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 16 నుంచి సింగోటం లక్ష్మీనరసింహస్వామి తిరుణాలకు భక్తులను ఇంజిన్ బోట్లలో తరలించరాదని ఆదేశించారు. నదిలో బోట్లు తిప్పుకోవాలంటే తప్పనిసరిగా పోర్ట్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్, లైఫ్ జాకెట్స్ ఉండాలని సూచించారు. ఘాట్‌ల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈఓఆర్డీ పుల్లయ్య, ఏఎస్ఐ కృష్ణుడు, వీఆర్వో వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ ఉన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి



జగనన్న లే అవుట్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం

మిడుతూరు: జగనన్న లే అవుట్లలోని ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ఉగాది పర్వదినం లోపు అధిగమించాలని హౌసింగ్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం అన్నారు. గురువారం మండలపరిధిలోని బైరాపురం, జలకనూరు గ్రామాల్లోని జగనన్న లే - అవుట్లలో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటి నిర్మాణాలపై పురోగతి లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

ఆత్మకూరు: యువతకు స్వామి వివేకానంద ఆదర్శమని వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర అన్నారు. కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతివేడుకలు నిర్వహించారు. వీహెచ్‌పీ అధ్యక్షుడు, న్యాయవాది గరుడాద్రి సుదర్శన్, నంద్యాల జిల్లా ప్రసరాల ప్రముఖ్ శ్రీధర్ గుప్త, ఆవులరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటనరసయ్య అధ్యాపకులు కృష్ణ, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలి

పాములపాడు: యువత ఉన్నత ఆశయాలను కలిగి ఉండాలని ఐజీ వైఎస్ఎస్ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇస్కాల గ్రామంలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రంథాలయంలో స్వామి వివేకానంద 160 జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐజీవైఎస్ఎస్ సభ్యులు స్వామి నాయుడు, ఈశ్వరయ్య, డాక్టర్ మౌలాలి, లక్ష్మీనారాయణ, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.బుచ్చయ్య, అధ్యాపకులు డి.సి. ఉన్నూర్‌సాహెబ్, ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

జూపాడుబంగ్లా: దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఏడీఈ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పక్కీర్‌సాహెబ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి బీసీల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని వాట్సాప్ గ్రూప్‌లలో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పార్టీ ఆదేశాల మేరకు క్రమశిక్షణ కలిగి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తూ, అందరినీ కలుపుకొని పోతున్న ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేయడం నీచమైన చర్య అన్నారు. ఆరోపణలు చేసే నాయకులు పార్టీ అభివృద్ధి కోసం ఏం చేశారో తెలపాలన్నారు.

చెంచులకు ఆధార్‌కార్డులు

జూపాడుబంగ్లా: జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరకు మండలంలోని చెంచులకు ఆఘమేఘాల మీద ఆధార్‌కార్డులు జారీచేశారు. గురువారం మండలంలోని 80బన్నూరు, కొత్తసిద్ధేశ్వరం గ్రామాల్లో మొబైల్ ఆధార్‌కేంద్రాలను ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి ఏర్పాటు చేయించారు. ఈఓపీఆర్డీ దగ్గరుండి ఆధార్‌కార్డుల్లేని చెంచులకు స్వయంగా వారి వివరాలు తీసుకొని నూతన కార్డులు జారీచేయించారు. బన్నూరులో 6, కొత్తసిద్ధేశ్వరంలో 10మంది చెంచులకు ఆధార్‌కార్డులు మంజూరు చేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

జూపాడుబంగ్లా: భారతీయ సంప్రదాయాలకు పండుగలు ప్రతీకలని ఆవాజ్‌కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్‌రహిమాన్ అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ఆర్ ఆర్ఆర్ హోంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కులమతాలకు అతీతంగా మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు సలీమాబేగం బహుమతులు అందజేశారు.

కష్టాన్ని చూసి స్పందించిన ఎమ్మెల్యే శిల్పా



వెంకటేశ్వర్లుకు నూతన వస్త్రాలు అందిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి

మహానంది: గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుక్కాపురంలో ఇటీవల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పర్యటించిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు లేని వెంకటేశ్వర్లు సోదరులను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కలిసి మాట్లాడగా సమస్యలు చెప్పుకున్నారు. దీంతో స్పందించిన ఆయన సంక్రాంతి పర్వదినం సందర్భంగా అన్నదమ్ములకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున నూతనవస్త్రాలు కొనుగోలు చేసి నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం అందించారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వర్‌రెడ్డి, గ్రామ యువనేతలు కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా అధికారుల సమావేశం

కొత్తపల్లి: రాష్ట్రంలోనే ఏకైక సరస్వతిదేవి క్షేత్రంగా కొలనుభారతిదేవి క్షేత్రం విరాజిల్లుతుంది. అమ్మవారి పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏటా ఆలయంలో వసంతపంచమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. అయితే ఈనెల 26న వసంతపంచమి వేడుకలు జరగాల్సి ఉంది. దీనికి ముందుగానే ప్రతి ఏటా జిల్లా స్థాయి అధికారులతో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించే వారు. ఈ ఏడాది కూడా అదేతరహాలో గురువారం ఆత్మకూరు ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం జరగాల్సి ఉంది. ఈ సమావేశానికి ఆర్డీఓ రాలేదని తెలుసుకున్న మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో ఆలయ ఈఓ మోహన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కిందిస్థాయి సిబ్బందిని పంపించడంతో సమావేశం వచ్చారు.. వెళ్లారు అన్నట్లుగా తూతూ మంత్రంగా సాగింది. మూడు గంటలకు సమావేశం కావాల్సిన అధికారులు 4గంటలకు మొదలుపెట్టి ఏర్పాట్లపై కనీసం 15 నిమిషాలు కూడా చర్చించుకోక పోవడం గమనార్హం. సమావేశంలో గ్రామ సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, డీటీ మనోహర్, విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రాజు, ఫారెస్ట్ అధికారి స్వరూప్, అగ్నిమాపక శాఖ సీఐ బీముడు నాయక్, ఏఎస్ఐ రామ్‌నాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితునికి చెక్కు అందజేస్తున్న ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన మండ్ల మద్దిలేటి అనే వ్యక్తికి రూ.20వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డాసు ధాకర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రాజు అందజేశారు. నాలుగు మాసాల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగటంతో మద్దిలేటి ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అతను సీఎం రిలీఫ్ ఫండ్‌కోసం దరఖాస్తుచేసుకోగా శాప్‌చైర్మన్ సిద్ధార్థరెడ్డి సహకారంతో అతనికి రూ.20వేలు మంజూరైంది. ఆ చెక్కును వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితునికి అందజేయటంతో ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెంకటనాయుడు, సోమశేఖర్, పల్లెకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తాండవ మల్లేశ్వరుడి తిరునాల



ఉత్సవాలకు ముస్తాబవుతున్న తాండవమల్లేశ్వరస్వామి ఆలయం

కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లిలో వెలసిన శ్రీతాండవమల్లేశ్వరస్వామి తిరునాల ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు ముస్తాబు చేస్తున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా 14న స్వామివార్లకు బిందెసేవ, గణపతిపూజ, అంకురార్పణ, తాండవ మల్లేశ్వరస్వామిని(శుభ ముహూర్తం) పెళ్లికుమారునిగా ముస్తాబు, 15న అర్ధరాత్రి స్వామిఅమ్మవార్ల కల్యాణమహోత్సవం, 16న స్వామి అమ్మవార్ల ప్రభోత్సవం, 17న పారువేట ఉత్సవం నిర్వహిస్తారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ సీఈఓ రమణ, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

జూపాడుబంగ్లా: చదువుతో పాటు క్రీడల్లో రాణించటం వల్ల సమాజంలో గుర్తింపు లభించటంతో పాటు అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని శాప్ సీఈఓ రమణ, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ కిషోర్, రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శాప్‌చైర్మన్ సిద్ధార్థరెడ్డి సహకారంతో గురువారం నందికొట్కూరు పట్టణంలోని జూనియర్ కళాశాలలో కబడ్డీ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం శాప్ సీఈఓ రమణ రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేల నగదు బహుమతులను శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి చేతులమీదుగా ఈనెల 14న అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి కౌన్సిలర్లు రూపాదేవి, నాయబ్, రావూఫ్, చిన్నరాజు, విజయమ్మ, లక్ష్మిదేవి, చిన్నరాజు, హమీద్, శివనాగిరెడ్డి, చాందబాషా, కృష్ణ, సర్పంచ్ నాగస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, కోసిక తిరుమలేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను గురువారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచ్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతి కర్రలు



వృద్ధులకు (ఊత) చేతి కర్రలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి

మిడుతూరు: భగవాన్ శ్రీ బాలసాయిబాబ ట్రస్టు కర్నూలు వారి సహకారంతో మండల పరిధిలోని మాసపేట గ్రామంలోని వృద్ధులకు జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య చేతులమీదుగా గురువారం ఊత కర్రలు పంపిణీ చేశారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో కూడా సేవా కార్యక్రమాలు చేపడతామని గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామ సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు, మోటర్ బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. కర్నూలు నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న పల్లెవెలుగు అద్దె బస్సు, ఆత్మకూరు నుంచి కరివేనకు వస్తున్న బైకు డిపోల్ పాఠశాల వద్ద ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ఉన్న కరివేన గ్రామానికి చెందిన మహేష్, సుబ్బన్న, కటరమణ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చకిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఎస్ఐ కృష్ణమూర్తి సంఘటన స్థలానికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

జూపాడుబంగ్లా: నిరుద్యోగ యువకులకు సోలార్ పీవీ మెయిన్‌టనెన్స్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నందికొట్కూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. సునీత తెలిపారు. జిల్లా కేంద్రంలోని నంద్యాల స్కిల్‌హబ్ కేంద్రంలో సోలార్ మెయిన్‌టనెన్స్ కోర్సు నిర్వహిస్తున్నారన్నారు. పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ అభ్యసించిన 28 ఏళ్లలోపు వారు అర్హులన్నారు.